
77134

# మమత




విహారిణి శాలివాహన

పద్దెనిమిది గదుల భవంతి, బాడ్మింటన్ కోర్టంత లోవాకిలి, అంతకు రెండింతలుగా దొడ్డి, వెరశి లంకంతగల కొంపలో బిక్కు బిక్కుమంటూవున్న తామిద్దరికీ, ముఖ్యంగా ఆయన ఆఫీసుకి వెళ్లినపుడు ఏకాకిగా ఉండే తనకూ తోడుగా ఉంటారనీ—

చిన్న పిల్లల ఆట పాటలతో, తప్ప టడుగులతో ఇల్లు కలకలలాడుతూవుంటే తనకు ముద్దూ, మురిపెమూ తీరుతాయనీ—

అడుగడుగునా, మేము విన్నొదిలిపోయే మంటూ జ్ఞప్తికివచ్చి తన మనసును కలత పెట్టే గతకాలపు స్మృతులనుండి తనకు విముక్తి లభిస్తుందనీ—

ఆశించి, ఇంటిని రెండు భాగాలుగా విభజించి, ఒక్క భాగాన్ని కేవలం నామ మాత్రమైన 'అద్దె'కు—ఇరవై రూపాయలకు—ఇవ్వటానికి అంగీకరించింది జయమ్మ. అతను—అతనిపేరు శివరాజు, తమ కేదో దూరపు బంధువవుతాడని చెప్పా రాయన—సన్నగా, పీలగా ఉంటాడు. ఏదో ఆఫీసులో ఉద్యోగి. నెలకు రెండొందలుదాకా సంపాదిస్తాడట. అతని సతీమణి కమల ముగ్గురు బిడ్డల తల్లి. పాపం ఎప్పుడూ ఏదో నలతతో ఉంటుంది. నవ్వుతూ పలుకరిస్తుంది. నిష్కపటంగా మాట్లాడుతుంది. ఆ తల్లిదండ్రులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంటారు వాళ్ల పిల్లలు. పెద్దవాడు ప్రభు. ఎర్రగా, బొద్దుగా, చలాకీగా ఉంటాడు. నాలుగో క్లాసు కాబోలు చదువుతున్నాడు. రెండో వాడు రాము. అన్న పోలికే. కాని అన్నకంటే చిలిపివాడు. వాడి చూపుల్లోనూ, చేతల్లోనూ చిలిపితనం మూర్తీభవించి ఉంటుందెప్పుడూ. మూడోది రాణి. మూడేళ్లపిల్ల. ముద్దు లొలికే మొహం. 'రత్నాల్లాంటి పిల్లలు' అనుకుంది జయమ్మ వాళ్లను చూడటంతోటే. అనుకుని, ఆ ముగ్గుర్నీ తదేకంగా, ఆప్యాయతతో, లాలనతో ఎంతసేపు చూస్తూవుందో మరి, "బామ్మగార్రా! నమస్తే చెప్పండి మరి" అన్న కమల మాటలతో తేరుకుంది. ముగ్గురు పిల్లలూ నమస్తే చెప్తుంటే, జవాబు [illegible] నవ్వింది జయమ్మ.

ఆ పిల్లలు ముగ్గురూ తనను 'బామ్మగారూ' అని, విశ్వనాథంగార్ని 'తాతగారూ'

దీపావళి కథల పోటీలో మొదటి

అని పిలుస్తుంటే మొదట్లో జయమ్మ మనసు చివుక్కుమంది. తను అప్పుడే బామ్మ కావడమేమిటి అని. కాని తర్వాత, తర్వాత అంతగా బాధ అనిపించలేదు. బహుశః వాళ్లు అలా పిలుస్తూనే ఉండటంవల్ల దానికి అలవాటు పడిందో, లేక మొట్టమొదటి సారి తనకు పుట్టిన బిడ్డడు బ్రతికివుంటే వా డిపాటికి పెళ్లి చేసుకుని ఒక యింటి వాడు అయివుండేవాడనీ, వాడికి పుట్టిన పిల్లలు తనను 'బామ్మా' అని పిలిచేవాళ్లనీ, ఆ దృష్ట్యా తనది 'బామ్మ వయసే' నని వూహించి సరిపెట్టుకుందో మరి.

ప్రభు రోజూ ఉదయం ఏడు గంటలకు, అంటే బడికి వెళ్లేముందు 'బామ్మా'అంటూ జయమ్మ దగ్గరకు వస్తాడు. జయమ్మ పెట్టే 'దేముని ప్రసాదం' తీసుకోకుండా ఏ రోజూ బడికి వెళ్లడు ప్రభు. ప్రభుతో పాటు 'రాము' కూడా వస్తాడు. 'బామ్మా! నాక్కూడా పెట్టవా' అంటూ చిలిపిగా చూస్తాడు. 'బామ్మా! మరేమో నేనూ వస్తున్నానా అని చెప్తున్నా వినకుండా వీళ్లిద్దరూ నాకంటే ముందు వచ్చేశారు చూడు' అని ఫిర్యాదు చేస్తూ వస్తుంది రాణి. నిజంగా రాణిలా అధికారం చెలాయిస్తుంది, దర్పమూ చూపిస్తుంది రాణి. దాని మాటలకు నవ్వుతూ జయమ్మ ముగ్గురికీ కొబ్బరి ముక్కలు పెడ్తే, వాటిని కళ్ల కద్దుకుని, ఆప్యాయంగా నోట్లో వేసుకుని బిలబిలమంటూ వెళ్లిపోతారు వాళ్లు.

మధ్యాహ్నం తీరిక సమయాల్లో జయమ్మ ఏదో పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటే బుద్ధిమంతుల్లావచ్చి ఎదురుగా కూర్చుంటారు రాము, రాణి. ప్రభు ఆ సమయంలో బడికి వెళ్లిఉంటాడు. రాముకు కథలంటే ఎంతో ఇష్టం. 'ఏదన్నా కథ చెప్పు బామ్మా. నీ కెన్నో కథ లొచ్చుట, తాతయ్యచెప్పాడు. కథలు వచ్చీ చెప్పకుండా ఉండకూడదు బామ్మా' అంటూ, చిలిపి కళ్లను ఇంతింతవిచేసి మాట్లాడ్తాడు. అడగాలేగాని, చెప్పకుండా ఎలా ఉండగలదు జయమ్మ?

పాటలంటే చెవి కోసుకుంటుంది రాణి. ఎప్పుడెప్పుడూ అధ్యాత్మ రామాయణ కీర్తనలు పాడుకోవటం అలవాటు జయమ్మకు. తోచనప్పుడల్లా వచ్చి, 'పాట పాడవా బామ్మా' అని మారాం చేస్తుంది రాణి, జయమ్మ పాడేవరకూ.

ఆ ముగ్గురు పిల్లలూ ఆత్మీయులుగా ఆమెకు దగ్గర కావటానికి దోహదం చేసిన సంఘటనలలో కొన్ని మాత్రమే యివి.

ఆ ముగ్గుర్నీ అంత ఆప్యాయంగా చూసుకుంటూ వాళ్లతో అంత స్నేహంగా ఉంటున్నా జయమ్మకు తృప్తి కలిగేదికాదు. అందుకు కారణం 'ఎంత చనువుగావున్నా పరాయి పిల్లలు పరాయి పిల్లలే' అనే భావన మాత్రం కాదు. గుమ్మడిపండుల్లాంటి ఆ పిల్లల్ని దగ్గరకు తీసుకోవాలనీ, చిదిమితే పాలు కారుతవన్నట్లుండే వాళ్ల చెక్కిళ్లను తమ చేతుల్తో స్పృశించి, వాళ్లను తన హృదయానికి అదుముకోవాలని, తన చేతుల్తో వాళ్లను ఎత్తుకుని త్రిప్పాలనీ ఉవ్విళ్లూరేది. మొదట్లో అలా వాళ్లను దగ్గరకు తీసుకోబోయే సమయంలో హఠాత్తుగా తన ఆడబిడ్డ అనసూయమ్మ లోగడెప్పుడో తన నుద్దేశించి అన్న మాటలు జ్ఞప్తికివచ్చి తన ప్రయత్నాన్ని విరమించుకుంది. అప్పట్నుంచీ ఆ పిల్లల్ని తన దగ్గరకు తీసుకుందామనుకున్నా, కనీసం అలా ముట్టుకుందామనుకున్నా భయం వేసేది. ఆడబిడ్డ మాటలు ఒక్కొక్కమాట ఒక్కొక్క అనసూయమ్మలా వచ్చి అడ్డు నిలిచేవి. తనలో పొంగి పొరలే మాతృప్రేమపై విష బిందువుల్ని చిలికినట్లుగా ఉస్సురనేది. నోరూరించే తియ్యని తిను బండారా లెన్నిటినో ఎదురుగా పెట్టి కూడా 'వాటిని నువ్వు ముట్టుకుంటే అవి విషంగా మారిపోతాయని' శపించినట్లుగా బాధపడేది జయమ్మ ఆ సమయాల్లో.

అప్పుడప్పుడూ తమంత తాముగా వచ్చి తన ఒళ్లో కూర్చోవాలనీ, ముద్దుగా తన కాళ్లకు చుట్టుకోవాలనీ రాముగాని, రాణిగాని ప్రయత్నిస్తే తను దూరంగా తప్పుకుని 'తాకకూడదమ్మా' అని వారించేది. విధిలేక తను అలా వారించినప్పుడు తన హృదయాన్ని కసికొద్దీ ఎవరో పిండివేసినట్లు బాధపడేది. జయమ్మ తాకరాదని తను వారించినప్పుడు 'ఎందుకని బామ్మా' అని వాళ్లడిగితే తను నిరుత్తరాలయేది. ఏమని జవాబు చెప్తుంది. 'నేను పాపిష్టిదాన్ని. నా చేతులు...నా చేతులు' అని ఏదో చెప్పి తన అసహాయతను వ్యక్తం చేయాలని అనుకునేది. కాని అలా చేయలేక పోయేది.

"ఎందుకని బామ్మా" అని తామడిగిన ప్రశ్నకు జవాబు రానందుకు ఆ చిన్నపిల్లలు చిన్నబుచ్చుకుని, తమ భాగంలోకివెళ్లి కమలను అడిగారు ఒకసారి. "అమ్మా! బామ్మగారిని తాకకూడదా" అని. కమల క్షణం సేపు నంగావుండి జవాబు చెప్పింది. "తాకకూడదుబాబూ! పెద్దవాళ్లు ఎప్పుడూ మడి కట్టుకుని ఉంటారుకదూ" అని.

పిల్లల మనసు నొప్పించినందుకే గాకుండా తనను గురించి, తను పిల్లలతో మెలుగుతున్న వింత ప్రవర్తనను గురించి కమల ఏమనుకుందోనని జయమ్మ కృంగిపోయింది ఆ క్షణంలో. ఏమనుకుంటేమాత్రం తనేం చేయగలదు? ఇదివరకు తనను గురించి ఎంతోమంది ఎన్నో విధాలుగా అనుకున్నప్పుడు ఏం చేయగలిగింది గనుక, ఎవరూ చూడకుండా వోపిక ఉన్నంతవరకూ ఏడవటం తప్పించి?

ఒకరోజు రాత్రి.......

రాణి నిద్రపోకుండా అల్లరి చేస్తుంటే శివరాజు కోపగించుకుని కసిరాడు. రాణి ఏడుస్తూ 'బామ్మ దగ్గరకు వెళ్తా' నంటూ రాబోయింది కాబోలు, 'ఆగు! కదిలావంటే చంపేస్తాను. వచ్చి పండుకుంటావా లేదా' అంటూ శివరాజు రాణిని లాక్కు వెళ్లినట్లున్నాడు. తమ భాగంలో పండుకుని ఇదంతా వింటున్న జయమ్మ నిస్సహాయంగా నిట్టూర్చింది. విశ్వనాథంగారు కూడ బాధపడి 'శివరాజుకు కోప మెక్కువ' అన్నాడు మెల్లిగా. 'బక్కకోపం' అనుకుంది జయమ్మ తనలో కసిగా.

శివరాజు అంటున్నాడు...."ఆవిడెందుకు పిల్లలంటే అంటీ ముట్టనట్లుంది. మనం ఉంటం యిష్టం లేదా ఏమిటి?"

జవాబుగా కమల కంఠం వినిపించింది "ఎవరు? జయమ్మగారా? పాపం ఆవిడ నేమీ అనకండి. చాలా మంచి దావిడ. నవనీతం లాంటిది ఆవిడ మనసు."

"మరెందుకు, పిల్లల్ని ముట్టుకోనివ్వదట. ప్రభు చెప్పాడు. మనమేమీ అంటరాని వాళ్లం కాదుగా?"

"దాని కంతా పెద్ద కథ ఉంది లెండి.

## బహుమతి పొందిన రచన

గృహిణులకు
శుభవార్త
మనదేశం యిప్పుడున్న స్థితిలో
స్టెయిన్‌లెస్‌స్టీల్
సామానులు

ధరలు విపరీతముగా పెరిగినవని
బాధపడ నవసరములేదు.
★
మీ యింటిలోని ఇత్తడి—రాగిపాత్రలకు
స్టెయిన్‌లెస్‌స్టీల్ రూపు, కళ
చవుకగా చేయుటయందు
శ్రీ గౌరీశంకర్ ఇండస్ట్రీస్
D–2, ఇండస్ట్రియల్ ఎస్టేటు,
విజయవాడ_7
వారితో
సంప్రతించండి.
—విజయ పబ్లిసిటీస్



తర్వాత చెప్తాను. వాళ్ళు వింటారు అరవ కండి......"

జయమ్మ ఉలిక్కిపడింది. తన రహస్యాన్ని కమల కనిపెట్టిందా? తననుగురించి కమలకు తెలిసిన పెద్ద కథ ఏమిటో! చిన్నదైనా, కమల ఎంతో తెలివి కలది. ఆవిడ మనసులాంటి మనసు అందరికీవుంటే ఎంత బావుంటుంది! అప్పుడు తనకీ అపవాదు, మనఃక్లేశం ఉండేవికాదు,అనుకుందిజయమ్మ.

వాళ్ల మాటల్ని విన్న విశ్వనాథంగారు జయమ్మతో అన్నారు: "చూశావా ఎలా అనుకుంటారో నిన్ను గురించి. ఇప్పటికైనా నీ పద్ధతి మార్చుకో. పిచ్చి పిచ్చి అనుమానాల్ని పట్టుకుని వ్రేళ్లాడినందువల్ల నీవు సాధించే దేమీ ఉండదు. పైగా........" ఆయన మాటల్ని ఆపైన వినలేదు జయమ్మ. అవతల కమల మాటల పైకి పోయింది ఆమె మనసు......

"ఈసారి అబ్బాయో, అమ్మాయో!"

"ఎవరికి?"

"..........."

"ఐ. సీ. ఇన్నాళ్లబట్టీ చెప్పావుకాదేం....! వెరీగుడ్.....కాని.....ఇక చాల్లే కమలా. ఈసారి నువ్వో నేనో ఆపరేషన్ చేయించుకుందాం"

"ష్ష్......"

జయమ్మ, విశ్వనాథంగారు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. జయమ్మ మొహంలో మెరపులా మెరిసిన హాసరేఖ ఒకటి ఆమెకు రెండు దశాబ్దాల దూరంలో దాగిన సంఘటనను కళ్లకు కట్టినట్లుగా చూసింది. ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనలు వాటి పరిణామాలూ కళ్లముందు కదలాడేయి........

కాపురానికొచ్చిన మూడో సంవత్సరంలో..

తను తల్లి కాబోతున్నట్లుగా ఆయనకు చెప్పినప్పుడు......

విశ్వనాథం ఆనందంతో జయను ఉక్కిరిబిక్కిరి చేశాడు. జయమ్మ పొంగిపోయింది. తన జీవితం ఇక నందనవనమేననిపించింది. అవునుమరి, తన కింకేం తక్కువ?

ఆనాడు ఎంతగా పొంగిపోయిందో, తర్వాత అంతగా కృంగిపోయింది జయమ్మ. పుట్టిన బిడ్డ పురిటి నీళ్లు కూడా పోసుకోకుండా పోయినందుకు.

పుట్టిన సంతానం బ్రతుకకపోవటం అటు కన్నవారింట్లోనూ, ఇటు అత్తవారింట్లోనూ ఎరుగరు. తన తల్లికి తాము ఎనిమిది మంది కూతుళ్లు, తమకు ఐదుగురు అన్నదమ్ములూనూ. పెద్దన్నయ్య కిప్పటికి ఏడుగురు సంతానం. అందరూ తుండుల్లా పెరిగారు. అలాంటిది "ఎవ్వరికీలేని ఆనవాయితీ నీకెక్కడొచ్చిందే" అని వాపోయింది తల్లి, పుట్టిన రెండో బిడ్డ కూడా పోయినప్పుడు. నిస్సహాయమైన నిట్టూర్పునే జవాబుగా చెప్పింది జయమ్మ.

ఆ తర్వాత....దేవకికి మల్లే ఏడుగురు పుట్టేరు. అయినా విధి వారి పాలిటికి కంసుడయ్యాడు. దేవకి అష్టమ గర్భం కంసుని పాలపడలేదు. తనకూ అలాగే జరుగుతుందేమోనని ఆశపడింది జయమ్మ. కాని అంత అదృష్టం పట్టలేదు. అసలు గర్భమే ధరింతలేదు మళ్లా.

"ఏం చేస్తాంలే. బిడ్డల్ని పెంచే అదృష్టం నీకులేదు. ఎవరు చేసిన కర్మ వారు అనుభవించకపోతే ఎలా?" అని నెమ్మదిగా అంటించేది ఆడబడుచు అనసూయమ్మ.....

.....సుశీలకు మళ్లా మగ పిల్లవాడు పుట్టేడని విన్నప్పుడు జయమ్మ ఎంతో సంతోషించింది. సుశీల తనకు చెల్లెలు. దాని కిది నాలుగో కాన్పు. పోయినసారి తను వాళ్లవూరు వెళ్లినప్పుడు చూసింది, దాని పిల్లలు గుమ్మడి పండ్లలా ఉంటారు. తను ఎంతో ముచ్చట పడింది, ఆ పిల్లల్ని చెల్లెలి సంసారాన్నీ చూసి. అంతరాంతరంలో రవ్వంత అసూయ కూడా మొలకెత్తకపోలేదు.

ఆ అసూయ శాపంగా పరిణమించిందో ఏమో, ప్రసవించిన పది రోజుల్లోనే పసికూనను వదలి పరలోకగతురాలైంది సుశీల. చెల్లెలి అంత్యక్రియలకు వెళ్లినప్పుడు ఆ పిల్లల ఆక్రందనలు, తండ్రి బేలతనమూ చూసి బెంబేలుపడిపోయింది జయమ్మ. అక్కడే ఉండిపోయి ఆ పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుతూ ఉండాలనిపించేంతటి జాలి నిండింది హృదయంనిండా. కాని అది సాధ్యమా?

జయమ్మ ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే వో పండు ముత్తైదువ గోపాలాన్ని పలకరిస్తూ అంది "వూరుకో నాయనా! గతించిన దానికోసం కన్నీరు పెట్టటం మంచి పనికాదు. నీకేమంత వయసు ముదిరిందని? మళ్లీ పెళ్లి చేసుకో, మగవాడివి పిల్లల్తో ఎలా వేగగలవు? అప్పటిదాకా ఈ చంటివాడ్ని సాకేమార్గం ఆలోచించు. కొంత కాలంపాటన్నా ఈ పసి కందును పెంచే బాధ్య

తను స్వీకరించే వారెవరూలేరా నీ వైపు?'

జయమ్మకనిపించిందప్పుడు, 'చంటి వాడ్ని తనే ఎందుకు తీసుకపోకూడదూ!' అని. కాని ఆ మాటను తానుగా చెప్పలేక పోయింది. తను అడిగితే అంగీకరించవచ్చు, అంగీకరించకపోవచ్చు. తనకు ఏడుగురు సంతానం పుట్టిపోయారని, తన హృదయం పిల్లల కోసం తపించిపోతోందని గోపాలరావుకూ తెలుసు. తెలిసినా 'ఈవిడదగ్గర పిల్లలు అనవాయితీగా పోతున్నార'ని సంకోచిస్తాడేమో ఆ కారణంవల్ల కాకపోయినా, మరే కారణంవల్లా అతను అంగీకరించకపోయినా తన హృదయం ఎంత క్షోభిస్తుంది?

చివరకు గోపాలమే ఆమెను అర్థించాడు, "నీవు తప్ప నా కెవరున్నా రొదినా? చెల్లెలు పోగానే బాంధవ్యం చెల్లిపోయిందని భావించకు. వీడి సంరక్షణభారం వహించావంటే చాలు, పెద్ద పిల్లలతో నేనేదో తంటాలు పడతాను. కాదనకు" అని.

తన కంతకన్నా కావలిసిందేముందని పించింది జయమ్మకు. వెంటనే ఆ పసి కందును తీసుకుని వచ్చేసింది. వాడే తనకు అష్టమ పుత్రుడనుకుంది. అయితే తనిప్పుడు దేవకికాదు. దేవకి చనిపోయింది. గర్భశోకాన్ని భరించలేక, పోయి కాలగర్భంలో దాగింది. తనిప్పుడు యశోద. నల్లని క్రిష్టుడ్ని పెంచే తల్లి. వాడివల్ల తనకు, తన యింటికి నిండుదనం చేకూరింది. తనకు సంతానం నిలువలేదే అనే దుగ్ధ తన దరికిప్పుడు రావటంలేదు. నలుగురిలోనూ, తనకు గౌరవం, మర్యాద లభ్యమవుతున్నాయి. అన్నింటికంటే మిన్నగా మురళిని ప్రేమిస్తూ, లాలిస్తూ పెంచుతోంది. మురళీ తనలోకం.

కాని, మురళికి ఈ లోకం నచ్చలేదు. ఈ లోకానికి ఎందుకు వచ్చానా అని బాధపడ్డాడు. ఒకరోజు ఉన్నట్టుండి ఈ లోకం వదిలిపోయాడు.

జయమ్మకు లోకం చీకటైంది. కళ్లు కనిపించక కొట్టు మిట్టాడింది. కళ్లు కనిపించేసరికి అంతా శూన్యమైంది. మురళి, యశోద, మర్యాద, గౌరవం అన్నీ కలలోలా కరిగిపోయాయి. ఆమెకు హృదయ చలనం ఆగిపోయినట్లైంది.

మురళి మరణం ఆమెను మూడు నెలలు మంచం దిగకుండా చేసింది. అప్పుడే గోపాలరావు వచ్చాడు. అతనికి మొహం చూపలేకపోయింది జయమ్మ. "ఇలా జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు. పెరిగి పెద్దవాడై నీకు సంతానం లేని లోటునుస్తా తీర్చుడని ఆశించానేగాని, మూడేళ్లపాటు పెంచిన మిమ్మల్నీ, నన్నూ మురళి అన్యాయం చేస్తాడనుకోలేదు" అని గోపాలరావు కంట తడి పెట్టినప్పుడు "నా మురళిని నీవే చంపేవు" అని ఆరోపించినట్లుగా తోచింది జయమ్మకు.

దొడ్లో వేసిన కొబ్బరిచెట్టు మట్టలు యింకా తలను తాకుతూనే ఉన్నాయి. దానితోపాటు నాటిన ఎదురింటివారి కొబ్బరి చెట్టు వంద కాయల కాపును దింపి, మరో కాపుకు పూత తొడిగింది. "మీ కొబ్బరి చెట్టు మరగుజ్జుదిలావుంది. ఇక పెరగదేమో" అన్న అన్నపూర్ణ మాటలకు తన ఆడబడుచు అనసూయమ్మ ఇలా అంది, "నీకు తెలీదా, అన్నపూర్ణా! అలా అడుగుతావు. దాన్ని నాటింది ఎవరని?"

"ఎవరూ? జయమ్మేగా?"

"మరింకేం. దాని చేతి చలువకు ఏ బిడ్డ ఎగిదింది గనుక చెట్టు ఎదగటానికి!"

జయమ్మకు చెళ్లన చరిచినట్లయింది. కూర్చున్న కుర్చీ విరిగి, భూమి పగిలి తను పాతాళంలోకి కృంగిపోతే ఎంత బావుండునని పించింది. తనవి పాపిష్టి చేతులు. తన చేతులతో పెంచిన ఒక్క బిడ్డడూ బ్రతుకలేదు. ఆ సంగతి తెలిసి కూడ తమ మురళిని ఎందుకు తీసుక వచ్చింది? మురళిని తను తీసుక రాకుండావుంటే, వాడికి అల్పాయువు కాకపోవునేమోననిపించింది.

ఒక వ్యక్తిని పదిసార్లు 'నీవు దొంగవు, నీవు దొంగవు' అంటే అది అబద్ధమైనా నిజమేనేమోననే జంకు కలుగుతుంది అతనిలో. జయమ్మలో కూడ అలాంటి భయమే ప్రవేశించింది. నిజంగా తనలో పిల్లల్ని సాకి పెద్ద చేయలేని అనర్హత ఉందేమోననిపించింది. ఒక్కొక్కరి 'హస్త వాసి' అంటారు ఇదేనేమో! తన చేతులు, తన మనసు అంత పాపిష్టివి కాబోలు అనుకుంది. అలా అనుకున్నప్పటినుంచి ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చింది. సంతానవతులై, తమ సంతానపు ముద్దు మురిపాలతో తమ మాతృత్వాన్ని తరింప చేసుకున్న మాతృమూర్తుల్ని చూసినప్పుడల్లా మనసు చివుక్కుమనేది ఆమెకు. నేరం చేసిన దోషిలా తలవంచుకునేది. నలుగురిలో మాట్లాడాలన్నా, నలుగురితో కలసి తిరుగుదామన్నా వారు తనలోని నేరాన్ని— తనకుగల అనర్హతను ఎత్తి చూపుతారేమోనని భయంవేసేది.

"మనసులో ఏవేవో వూహించుకుని మానసికమైన అస్వస్థతను పెంచుకుంటూ నీకు నీవు ద్రోహం చేసుకోవటమే కాకుండా నాకూ ద్రోహం చేస్తున్నావు జయం!" అని విశ్వనాథంగారు అంటే నిజమేనేమో ననుకుంది జయమ్మ. కొందరికి సంతాన యోగమే ఉండదు. ఆ అదృష్టం వున్నా కొందరికి సంతానమే నిలువదు. మరికొందరికి నిలిచినా, ఆ సంతానం నిత్యం ఏదో వ్యాధితో పీడింపబడుతూ పెంచే తల్లిదండ్రులకు, చూచే పొరుగువారికి 'అసలు సంతానమే వద్దురా భగవంతుడా' అనిపించేంతటి బాధను కలిగిస్తారు. ఇదంతా భగవంతుని లీలా వినోదమే. ఒకరి కర్మకు మరొకరి కర్తృత్వం ఉండనే ఉండదు. నాకు పుట్టిన ప్రతి శిశువు అల్పాయువుతోనే పుట్టింది. అంతేగాని నా పెంపకం వలన నా 'చేతి చలువ' వలన వారికి ఆయువు తగ్గిపోవటంలేదు. అని మనసును సరిపెట్టుకుంది జయమ్మ. సరిపెట్టుకుని మామూలు మనిషిగా తిరుగ నారంభించింది. అలా తిరుగుతూ దొడ్లోకి వెళ్లినప్పుడల్లా, కొబ్బరి చెట్టు మట్టలు తలకు తగులుతూనే ఉన్నాయి. అప్పుడు ఆడబడుచు అనసూయమ్మ మాటలు గుర్తుకు వస్తూనే ఉన్నాయి. చెట్టు పెరగటానికి చేతి చలువకు సంబంధమేముందసలు? చెట్టు పెరగటానికి భూమిలో సరిపడే లవణాలు తగుపాళ్లలో ఉండాలి. అలా లేకపోతే చెట్టు చచ్చిపోతుంది. ముఖ్యంగా కొబ్బరిచెట్టుకు భూమిలో 'చట్టు' తగిలితే పెరగదు. ఈ నేలకి సరిపడే చెట్లని నాటితే ఎందుకు పెరగవు? ఇలా అనుకోగానే జయమ్మకో ఆలోచన వచ్చింది. తన చేతిమీదుగా నాటిన చెట్టు కూడా పెరిగి పెద్దదై ఫలవంతమవుతుంది అని నిరూపించాలనిపించింది. తన కాపరాని కొచ్చేసరికి నూతికి అటువేపుగా మంచి గుమ్మడిపాదు ఉండేది. ఇటు వేపుగా బొప్పాయిచెట్టు ఉండేది. పచ్చగా నిగనిగలాడే బంగారపు ముద్దల్లాంటి గుమ్మడిపండ్లు, తియ్యని బొప్పాయిపండ్లు ఎన్నో కాచేవి ఆ రెండు చెట్లూ. ఇప్పుడు మళ్లా తను వాటిని నాటితే? అవి పెరిగి పెద్దవై కాయలుకాస్తే, తన కొచ్చిన అపవాదు తొలగుతుంది అనుకుని వాటిని నాటింది.

కమల, శివరాజు ఆ యింటి కొచ్చేటప్పటికి గుమ్మడిపాదు ఏపుగా పెరిగింది. దొడ్డి అంతా అల్లుకుంది. బొప్పాయిచెట్టు నింగిని

K. V. రత్నం & సన్సు, పెన్ వర్క్సు, రాజమండ్రి. (A.P.)
ఫేమస్ ఫౌంటెన్ పెన్సు 14 Ct. గోల్డ్ నిబ్సులు
శాంతి ఫౌంటెన్ పెన్సు గోల్డుప్లేటెడ్ నిబ్సు
35 సం॥ల అనుభవము గల
రత్నంగారిచే తయారుకాబడినవి.



రత్నం
బాల్ పెన్సు & రీఫిల్సు
జర్మనీలో శిక్షణపొందిన మా ఇంజనీరు అనుభవంతో తయారు.
రీఫిల్సు మా ప్రత్యేకత—మన్నికకు ప్రఖ్యాతి గాంచినవి.






పిసలైన
మైకో
ఫిల్టర్ ఇన్సర్టులు
మీ ఫ్యూయల్ ఇంజక్షన్
ఎక్విప్‌మెంటును
రక్షించగలవు.

MICO®
LICENCE BOSCH

రిజిస్టర్డు ట్రేడ్ మార్కు.

మోటారు ఇండస్ట్రీస్ కంపెని లిమిటెడ్, బెంగళూరు
[illegible] ప్రతినిధులు :
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
శ్రీ [illegible]
[illegible]

# మ మ త

చూస్తానంటూ పెరుగుతోంది.

ఆ రెండు చెట్లూ పుష్పించాలి. పుష్పించి ఫలించాలి. అప్పుడు తన మనసు ఆనందంతో నిండుతుంది. తనకు కలిగిన అపవాదు కేవలం అపవాదేనని తృప్తిపడుతుంది. ఆ శుభ ఘడియ ఎప్పుడు వస్తుందోనని ప్రతిరోజూ నిద్ర లేవగానే ఆ చెట్లవైపు చూస్తుంది జయమ్మ.

* * *

జయమ్మ ఆరోజు వంట చేసుకుంటూండగా "బామ్మా ఏం చేస్తున్నావ్?" అంటూ రామూ వచ్చేడు.

"వంట చేస్తున్నా బాబూ!" అని సమాధానం చెప్పింది జయమ్మ.

"బామ్మా, మరేమో, నిన్న సాయంత్రం ఎక్కడి కెళ్లావ్?"

"ఎందుకుబాబూ!"

"నిన్న కోతి వచ్చిందిగా. నువ్వు చూడలేదు. బలే బావుంది బామ్మా! ఎంచక్కా గంతు లేసిందని. దానికి నేను వేరు శనక్కాయలు పెట్టేను. బలేతింది" అన్నాడురాము గొప్ప ఘనకార్యం చేసిన వాడిలా కళ్లు ఇంతింతవి చేసి.

"నిజంగానా" అన్నది జయమ్మ వాడి అమాయకపు సంతోషానికి తానూ దోహదం చేయాలని.

"నిజం బామ్మా! వేరు శనక్కాయలు తిన్నతర్వాత ఇంటిమీదికెక్కింది. అక్కడ్నుంచి గోడమీదకు దూకింది. గోడమీద నుంచి దిగి బొప్పాయిచెట్టు ఎక్కింది."

"పాపం దానికి తెలీదేమో, ఆ చెట్టు యింకా కాయలు కాయటం లేదని, ఆ శుభ సమయంకోసమే నే నెదురు చూస్తున్నానని" అని అంటూ బిందె తీసుకుని నూతి దగ్గరకు బయలుదేరింది. ఆవిడ మాటలు తన కర్థం కాకపోయినా, తను చెప్పింది విని, తన కేదో జవాబు చెప్పిందికదా అని తృప్తిపడి ఆవిడ ననుసరించాడు రాము.

"బామ్మా నే చూడు"

నూతిలోని చేదను లాగుతున్నదల్లా అటు వైపు చూసింది జయమ్మ. రాము బొప్పాయి చెట్టు పైకి ఎక్కుతున్నాడు. జయమ్మకు గుండె దడదడలాడింది. 'అక్కడ్నుంచిపడితే ఇంకేమైనా ఉందా? క్రింద వల్లని కోసు రాళ్లు కూడా ఉన్నాయి' అనుకుని చేతిలోని చేదను వదిలి 'రామూ' అంటూ అటు పరుగెత్తింది.

మనిషెత్తు కుప్పైన ఎక్కిన 'రామూ'ను దించుదామని చేతులు చూపింది జయమ్మ. తన ప్రయోజకత్వానికి తనే మురిసిపోతున్న రామూ వెంటనే ఆమె చేతుల్లోకి రాలేదు.

'షాక్' తగిలిన దానిలా తన చేతుల్ని వెనక్కు లాక్కుంది జయమ్మ. తను రామూను ముట్టుకోగూడదు. తన చేతులు పాపిష్టి చేతులు. కాదని నిరూపించటానికి తను నాటిన చెట్లింకా పుష్పించలేదు. అందుకని రామూను ముట్టుకోగూడదు.

'కెవ్వు' మనే రామూ కేకతో జయమ్మ ఆలోచన చెదరిపోయింది. కళ్లముందు జరిగిన ఘోరానికి తల్లడిల్లిపోయింది. ఈ ఘోరం తను రామూను ముట్టుకున్నందు వల్ల జరిగిందే!

రామూ కేకవిని ఇంట్లోనుంచి కమల, శివరాజు, విశ్వనాథంగారు అందరూ వచ్చారు. "ఏం జరిగింది పిన్నిగారూ" అంటూ కమల రామూను తీసుకుంది తన చేతుల్లోకి. జయమ్మ జవాబు చెప్పలేదు. రెండు చేతుల్లోనూ ముఖాన్ని దాచుకుంది.

ఏ రాళ్లమీదైతే పడతాడని భయపడి జయమ్మ రామూను దింపబోయిందో, ఆ రాళ్లమీదనే పడ్డాడు రామూ. తనను దింపటానికి బొమ్మ చేతులు జాపిందికదా అని పట్టువదలినరామూ, తనను బొమ్మ దింపిందో మరేమైందో తెలియని అచేతనావస్థలో ఉన్నాడు.

ఎంత ప్రయత్నించినా గాయంనుండి రక్తం స్రవించటం ఆగలేదు. అందరికీ ఆదుర్దా ఎక్కువైంది. అందరూ కలిసి అతన్ని హాస్పిటలుకు తీసుకపోయారు. జయమ్మను ఎవరూ రమ్మనలేదు. తానుగా వెళ్లటానికి ఆమెకు ధైర్యమూ చాలలేదు. అక్కడిదక్కడే కుప్పలా కూలిపోయిం దామె.

వీధిలో కుక్క ఒకటి ఏడుస్తోంది. ఆ ఏడుపు వినేసరికి జయమ్మ శరీరం జలదరించింది. ఎవరికే కీడు మూడుతుందోనని భయపడింది. రామూ కేమీ ప్రమాదం సంభవించదుకదా అనుకుంది. ఏమో! ఏం జరుగుతుందో!! చెట్టు ఎక్కిన పిల్లవాడు క్రింద రాళ్లమీద పడతాడేమోనని తన మనసు ఎందుకు శంకించాలి? వాడ్ని దించే ప్రయత్నంలో తను వాడి నెందుకు తాకాలి? అసలు తను దించాలని ప్రయత్నించకుండా వుంటే వాడంతట వాడు దిగి ఉండేవాడేమో! ఈ ఆలోచన రాగానే తనమీద తనకు ఏవగింపూ కోపమూ కలిగాయి. రామూ

# మమత

పడిన ప్రదేశాన్ని, అక్కడి రాళ్లను గుట్టను చూసింది. తన చేతుల్ని చూసుకుంది. ఆ చేతులమీద కోపం కట్టలు తెంచుకుంది. ఆ చేతుల్ని బలంగా ఆ రాళ్ల గుట్టకేసి బాదింది. జివ్వుమనేబాధ కోపాన్ని మింగేసింది. మళ్లీ చేతుల్ని చూసుకుంది. కుడి చేతిమధ్య వ్రేలు చివర చితికి రక్తాన్ని చిమ్ముతోంది. రాళ్లగుట్టపై పడిన రాము రక్తంతో తన రక్తమూ కలిసిపోయింది.

ప్రొద్దుటనుంచీ అలాగే కూర్చున్న జయమ్మను చూసి విశ్వనాథంగారు నిర్విణ్ణు అయారు. "జయం" అన్నారాయన. జయమ్మ భర్త ముఖంలోకి చూసి, "వచ్చారా! రామూ ఏడి? రామూ కెలా వుంది" అని అడిగింది ఆదుర్దాగా.

విశ్వనాథంగారు నిట్టూరుస్తూ, "ఇప్పుడే కట్టు కట్టేరు. గాయం బలంగా తగిలింది. సాయంత్రందాకా స్పృహ రాకపోవచ్చునన్నారు అయినా వాడు చెట్టెక్కుతుంటే చూస్తూ నిల్చున్నావా అక్కడే ఉండి? వారించకూడదూ?" అన్నారు.

'భగవంతుడా' అనుకుంది జయమ్మ బాధగా.

"లేచి త్వరగా వంట కానివ్వు. అలా దిగాలుపడి కూర్చుని చేయగలిగిందేముంది. అలా బజారువరకూ వెళ్లొస్తాను" అంటూ వెళ్లారు విశ్వనాథం.

విశ్వనాథంగారు వెళ్లారని నిర్ధారించుకున్న తర్వాత జయమ్మ నెమ్మదిగా లేచింది. నూతివద్దకెళ్లి నీళ్లతో చేతులూ కాళ్లూ కడుగుకుంది. దోసిలితో నీటిని తీసుకుని ముఖం కూడా కడుగుకుంది. ముఖాన్ని పమిటి కొంగుతోనే తుడుచుకుంటూ లోపలికివచ్చి అల్మారులోని కుంకుమ బరిణె తీసి అద్దం లేకుండానే బొట్టును దిద్దుకుంది. వ్రేలికి అంటుకున్న కుంకుమను పాపిట్లో రాసుకుంటూ పడమరవైపు గదిలోకి నడిచింది.

దివ్య లోకాలన్నీ ఆ గదిలోనే ఉన్నవా అన్నట్లుగావుంది ఆ గది. గదికి ఎదురుగా అట్టలతో ఏడుకొండలుగా అమర్చి ఆ పైని ఏడుకొండలవాని మంగళరూపం నిలుపబడివుంది. ఆయన కన్ను సన్నల్లనే తా మున్నామన్నట్లుగా ఒకవైపు భోళా శంకరుడు, సీతా రామ లక్ష్మణులు, మరోవైపు పంచముఖి వీరాంజనేయస్వామి, దుర్గ, కుమారస్వామి, రాధాకృష్ణులు వేంచేసి ఉన్నారు. ఎవరికి తగిన పూజా ద్రవ్యాల్, నివేదనా వస్తువులు ఎక్కడి కక్కడ సిద్ధపరుపబడి ఉన్నాయి. జయమ్మ దీపారాధన చేసింది. అగరు వత్తులను వెలిగించింది. అందరినీ మేల్కొల్పుతానన్నట్లుగా ధూపం గది అంతా అలుముకుంది. అందరినీ పేరు పేరునా సంబోధించింది జయమ్మ. చేతులు జోడించింది. "నేనేమి అపరాధం చేశాను? మీలో ఎవరికి ఏ లోటు కలిగించాను. మీరంతా కలిసి నాపై కక్ష కట్టేరా స్వామీ? ఈ ఉపద్రవమేమిటి? రామూ నా పంచ ప్రాణాల్లోనూ ఒక ప్రాణంగా ఉంటున్నాడు. వాడ్ని నానుండి దూరం చేస్తారా? వద్దు, మిగతా నా నాలుగు ప్రాణాల్నీ తీసుకోండి. రామూని రక్షించండి" అని వేడుకుంది. ప్రాధేయపడింది.

ప్రమిదల్లోని జ్యోతులు నిశ్చలంగా వెలుగుతూనే ఉన్నాయి. దేవతా విగ్రహాలు యధాతధంగా నిల్చునే ఉన్నాయి. అగరు వత్తుల ధూమం మాత్రం మా లోకం వేరే ఉందంటూ పైపైకి వెడ్తోంది.

సాయంత్రం కావస్తోంది. రామూ తల నుండి స్రవించిన రక్తపు మడుగులా పశ్చిమాకాశం ఎర్రబడింది. విశ్వనాథంగారు అప్పుడే రిక్షా దిగి విచారంగా లోపలికి వచ్చేరు. ఆయనను చూస్తూనే జయమ్మ అడిగింది "రామూకి స్పృహ వచ్చిందా" అని.

"ఇంకా రాలేదు. ఎక్కువగా రక్తం నష్టం కావటంవలన పరిస్థితి విషమించింది జయం. రామూకి ఇప్పుడు రక్తం కావాలి. కాని.....'

"కాని? ఏమిటీ, చెప్పండి!"

"రామూకి సరిపడే రక్తం ఇప్పుడు అందుబాటులోలేదు."

"వాడి తల్లిదీ, తండ్రిదీ......"

"ఎవరిదీ సరిపడలేదు. నా రక్తం కూడా పరీక్ష చేశారు. లాభం లేకపోయింది. ఆ రకం రక్తం కల బ్లడ్ డోనార్స్ ఈవూళ్లో ఇద్దరే ఉన్నారుట. కానీ వాళ్లూ అందుబాటులో లేరు."

* * *

హాస్పిటల్లోని తెల్లటి బెడ్‌మీద మాగన్నుగా పడుకునివున్న రక్తదాత్రి జయమ్మకు తమ దొడ్లో గుమ్మడిపాదు పుష్పించి ఫలించినట్లుగాను, బొప్పాయిచెట్టు బోలెడు కాయలు కాసినట్లుగానూ కల వచ్చింది. ●